
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 74 వ భాగం

### అజామీళోపాఖ్యానం – 9

### పుణ్యలోక ప్రాప్తి

ప్రాణం పోయిన అజామీళుడికి తనని బంధించి తీసుకెళ్లబోయిన యమకింకరులూ, వాళ్లని అదిలించి తనని విడిపించిన విష్ణుదూతలూ కనిపించలేదు. విష్ణుదూతలు ఒక్క క్షణకాలం కనిపించడానిక్కారణం – తన నోటమ్మట పూర్వజన్మ సుకృతం వల్ల శ్రీహరి నామం రావడం – అని తెలిసి వచ్చింది. భగవంతుడిమీద భక్తి కలిగింది. పూర్వ జన్మలో చేసిన పనులకి పశ్చాత్తాపం కలిగాక ఇంక శ్రీహరి మీదే మనసు లగ్నం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇన్ని కల్మషాలతో కూడిన తన మనసు ప్రక్షాళనం కావాలి కనక ముందు దాన్ని భగవంతుడిమీద కేంద్రీకరించాలి. అదయ్యాక భవబంధాలు తెగితే మరోసారి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. ఇప్పుడదే చేయబోతున్నాడు అజామీళుడు.

సీ. అనుచు నా బ్రాహ్మణుం డతి తత్త్వవేదియై;
భవబంధముల నెల్లఁ బాఱఁ దోలి
మొనసి గంగాద్వారమున కేగి యచ్చటఁ;
బ్రబ్బిన దేవతాభవనమందు
నాసీనుఁడై యోగ మాశ్రయించి చెలంగు;
దేహేంద్రియాదుల తెరువువలన
దనుఁ బాపుకొని పరతత్త్వంబుతోఁ గూర్చి;
మానుగా నాత్మసమాధిచేత [6-154]

ఆ. గుణగణంబుఁ బాసి కొమ రొప్పిన భగవ
దనుభవాత్మయందు నాత్మఁ గలిపి
రమణఁ దన్ను మొదల రక్షించినట్టి యా
పురుషవరులఁ గాంచి పొసఁగ మ్రొక్కె. [6-154.1]

ఇలా ఒక్కసారి పశ్చాత్తాపం కలిగి భక్తి మనసులోకి రాగానే జ్ఞానదీపం ప్రకాశించింది. దానితో భవబంధాలు తెంచుకుని గంగాద్వారానికి చేరాడు. అక్కడున్న దేవతా భవనంలో కూర్చుని యోగమార్గంలో దేహం, ఇంద్రియాలనీ తెంచుకుని త్రిగుణాతీతుడై (గుణగణంబు బాసికొని) సమాధి ద్వారా తన ఆత్మని పరమాత్మలో లీనం చేసాక (భగవదనుభవాత్మయందు – భగవంతుడి అనుభవంతో కలిగినది), ముందు తనని యమకింకరులనుంచి విడిపించిన విష్ణుదూతలు కనిపించడంతో వాళ్లకి నమస్కారం చేసాడు.

వ. అట్లజామిళుండు యోగమార్గంబున దేహంబు విడిచి పుణ్య శరీరుండై యగ్రభాగంబునం బ్రాగుపలబ్ధులైన మహాపురుష కింకరులం గాంచి, సమంచిత రోమాంచిత చలచ్చటాపింజరిత స్వేదబిందుసందోహ మిష నిష్యంద మహానందవల్లీకామతల్లికాంకుర సంకుల పరిశోభిత తనుండును, హర్ష నికర్షమాణ మానసోద్యోగ యోగప్రభావోత్సాహ విస్మయ మందస్మిత కందళిత ముఖారవిందుండును, నిఖిల జగజ్జేగీయమానాఖండ శుభప్రద శుభాకార సందర్శన సమాసాదిత కుతూహల మానసుండును నై, ప్రణామంబు లాచరించుచు భాగీరథీ తీరంబునఁ గళేబరంబు విడిచి, తత్క్షణంబ హరిపార్శ్వవర్తు లైన దాసవరుల స్వరూపంబుఁ దాల్చి, యా విష్ణుసేవకులతోడం గూడి దివ్య మణిగణఖచితంబై సువర్ణమయంబైన యసమాన విమానం బెక్కి, నిఖిలానంద భోగభాగ్యానుభ వాకుంఠితం బైన వైకుంఠనగరంబునకు శ్రీమన్నారాయణ పదారవింద సేవాచరణ పరిమాణ స్థితికిం జనియెను; ఇట్లు విప్లావిత సర్వధర్ముండైన దాసీపతి, గర్హిత కర్మంబులచేతఁ బతితుండును, హతవ్రతుండును నై నరకంబునం గూలుచుండి భగవన్నామ గ్రహణంబున సద్యోముక్తుం డయ్యె; కావున. [6-155]

ఇలా యోగమార్గంలో ప్రయాణించిన అజామీళుడు తనని రక్షించిన మహాపురుషులని చూసాడు. ఎలా? సమంచిత రోమాంచిత చలచ్చటాపింజరిత స్వేదబిందుసందోహ మిష నిష్యంద మహానందవల్లీకామతల్లికాంకుర సంకుల పరిశోభిత తనుండును (రోమాంచితమై, స్వేదజలం వంటిమీద కురుస్తుండగా), హర్ష నికర్షమాణ మానసోద్యోగ యోగప్రభావోత్సాహ విస్మయ మందస్మిత కందళిత ముఖారవిందుండును (మనసంతా ఆనందంతో నిండిపోయి), నిఖిల జగజ్జేగీయమానాఖండ శుభప్రద శుభాకార సందర్శన సమాసాదిత కుతూహల మానసుండును నై (ఇటువంటి మనసుతో ఆ శుభప్రదమైన వారిని దర్శించడంతో) వారికి ప్రణామం చేస్తూ వాళ్లతో పాటు విమానం ఎక్కాడు. అక్కడనుంచి వెళ్ళినది పరమానందం ఇచ్చే వైకుంఠానికి, అందులో ఉండే శ్రీమన్నారాయణ పదారవిందాలకి సేవ చేయడానికి చేరాడు. అలా ప్రాణంపోయే సమయంలో శ్రీహరి నామం ఉఛ్ఛరించడం వల్ల ఎన్ని పాపకర్మలు చేసినా ఘోరమైన నరకం చేరవల్సినవాడైనా భగవన్నామం వల్ల ముక్తి లభించింది.

ఇందులో సింగయగారి వచనం పోతన వచనానికి దీటుగా ఉండడం గమనించారా?

క. కర్మంబు లెల్లఁ బాయను
మర్మము దెలుపంగ లేదు మధురిపు పేరే
పేర్మిని నొడువుటకంటెను
దుర్మదమునఁ జిత్త మెన్ని త్రోవలఁ జన్నన్. [6-156]

ఉ. పాండవవంశపావన! నృపాలక! యీ యితిహాస మెవ్వఁడే
నొండొక భక్తి లేక విను నోర్పుమెయిం బఠియించు నాతఁ డు
ద్దండత ముక్తికామినికిఁ దానకమై దనుజారిలోకమం
దుండు మహావిభూతి యమదూతల చూడ్కికగోచరాకృతిన్. [6-157]

ఎన్ని కర్మలు చేసి మనసు ఎన్ని అడ్డదోవల్లో పోయినా చేసిన కర్మలన్నింటినీ పోగొట్టుకోవడానికున్న ఒకటే మార్గం – మధురిపుడి పేరు (మధు అనే రాక్షసుడి శతృవు, విష్ణువు) గుర్తుపెట్టుకోవడం. ఈ అజామీళుడి ఇతిహాసం పఠిస్తే యమదూతల చేతికి చిక్కడు. ఇదీ శుక మహర్షి పరీక్షిత్తుకి చెప్పినది. అసలు ఇలా ఓ కథ చెప్పాక ఇది గుర్తుపెట్టుకుంటే ఇలా అవుతుంది, పాపాలు దరిచేరవు అని చెప్పడం దేనికంటే, ఈ కథ మనసులో నిరంతరం

మెదులుతూ ఉంటే మనం పోయేటపుడు కూడా మనకి భగవంతుడు గుర్తు రావడానికి. ఇదే క్రితం నెల వ్యాసంలో నిరంతర అభ్యాసం వల్ల విష్ణుసహస్రనామం మనసులోకి ఎలా వచ్చిందో అనే కథలో చూసాం.

ఇంత విశదంగా చెప్పడం ఎందుకంటే, ఒక్కవారంలో పరీక్షిత్తు చావబోతునాడు. “నువ్వు పాపాత్ముడవి నీకు ఇంక ఏమీ దారి లేదు నరకం తప్ప” అని చెప్పడంకన్నా అజామీళుడు అనేకానేక పాపాలు చేసినా ఒక్క క్షణంలో మోక్షం పొందాడు కనక నువ్వు కూడా అలా చేయవచ్చు అని చెప్తున్నాడు శుక మహర్షి. మన గ్రంథాలు ఎన్ని చూసినా ఈ పద్యాల్లో చెప్తున్నట్టే ఎక్కాడా కూడా ‘నువ్వు పాపాత్ముడవి నీకు అసలు వేరే దారే లేదు నరకం తప్ప’ అని ఎక్కడా ఉండదు చూడండి. ఎందుకంటే మనిషిలో ఉన్న చైతన్యం భగవంతుడు. నువ్వు సాక్షాత్తూ ఆత్మ స్వరూపుడవి. పాపాత్ముడవి ఎలా అవుతావు? ఆ పరబ్రహ్మలోనుంచి వచ్చిన ఆత్మయే నువ్వు. అహం బ్రహ్మస్మి అనుకోవడం, అలా అనుకుంటూ అదే పరబ్రహ్మన్ని చేరడం — ఇదీ దారి. అంతే కానీ అహం పాపాత్మా, నేను ఎందుకూ పనికిరాను అనుకోవడం కాదు. స్వామి వివేకానంద, రమణులు కూడా ఇదే చెప్తారు — మొట్టమొదట చేయాల్సినది — నేను పాపాత్ముణ్ణి అనుకోవడం మానేసి, నేను ఆత్మస్వరూపడని అనుకోవడం — **అహం బ్రహ్మస్మి.** అయితే మన ఆత్మని తెలుసుకోవడం కోసం ఎక్కడికో వెళ్లడం కూడా అవసరం లేదు. నువ్వే స్వయానా ఆ స్వయంప్రకాశమైన ఆత్మవి – **అయమాత్మా బ్రహ్మ.** మనలో అటువంటి అహం బ్రహ్మస్మి, అనే ఆలోచన రావడానికి కారణం కూడా మనలో ఉన్న ప్రజ్ఞానమే కారణం. అందుకే ఆ ఆలోచన స్ఫురించే బుద్ధి కూడా బ్రహ్మమే — **ప్రజ్ఞానం బ్రహ్మ.** మరి ఇదంతా చూస్తే ఆత్మ ఉన్నది మన ఒక్కరి లోనేనా? కాదు చరాచర ప్రపంచంలో ఉన్నది భగవంతుడు తప్ప మరోకటి కాదు అందుకే **సర్వం ఖల్విదం బ్రహ్మ.** మొత్తం ప్రపంచం అంతా బ్రహ్మమే అయితే మనకున్న బాహ్య దృష్టివల్ల అది తెలుసుకోలేక మనందరం ఒకరినుంచి ఒకరు వేరుగా ఉన్నాం అనుకుంటున్నాం అన్నమాట. మీరూ, నేనూ అందరం కూడా ఆ చైతన్యమే — **తత్వమసి.** ఇదే మరో సారి గుర్తు చేసుకుందాం ఉపనిషత్ శ్లోకంలో

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే
పూర్ణాస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.

ఈ సర్వ చరాచర జగత్తులో ఏదైతే ఉందో అదంతా పూర్ణం (బ్రహ్మం). పూర్ణమదః (పరబ్రహ్మం, భగవంతుడైన ఆ మహా చైతన్యం పూర్ణం) పూర్ణమిదం (మనలో ఉన్న ఈ చిన్న చైతన్యం, ఈ సృష్టిలో సర్వమూ కూడా పూర్ణమే, ఎందుకంటే ఇది భగవంతుడి చైతన్యం లోంచి వచ్చినదే కనక), పూర్నాత్ పూర్ణముదచ్యతే (ఆ బ్రహ్మంలోంచి వచ్చిన ‘ఇది’ కూడా పూర్ణమే) పూర్ణాస్య (ఆ మహా చైతన్యం లోంచి ఏమి తీసినా అది కూడా పూర్ణం), పూర్ణామాదాయ పూర్ణమేవావశిష్యతే (ఈ చిన్న చైతన్యం ఆ మహా చైతన్యంలో కలిపినా అది పూర్ణమే).

ఇదే ఇంతకు ముందు వ్యాసాల్లో చదువుకున్నాం, శుకమహర్షి పరీక్షిత్తో చెప్పినట్టూ.

క. హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయముగాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన వింటే [2-17]

తే. అరయఁ బుత్రోపచారిత మైన విష్ణు
నామ మవసానకాలంబునను భజించి

శార్ఙ్గి నిలయంబుఁ జేరె నజామిళుండు
నిట్లు సద్భక్తిఁ దలఁచిన నేమిజెప్ప? [6-158]

ఇదంతా చూస్తే (అరయన్, తరచి చూస్తే) తెలిసేదేమిటి? అవసానకాలంలో భక్తిలేకుండా కొడుకు పేరు పలికినా అది విష్ణువు పేరు అవడం వల్ల పాపాలు పోయి అజామీళుడు శార్ఙ్గి (శార్ఙ్గము అనే విల్లు ధరించేవాడు, మహావిష్ణువు) నిలయం చేరాడు. ఇంక భక్తితో భగవన్నామం తలిస్తే దాని ఫలం ఇంత అని చెప్పడం ఎలా?

క. కోరినవారల కెల్లను
జేరువ కైవల్యపదము శ్రీవరుని మదిం
గోరనివారల కెల్లను
దూరము మోక్షాప్తి యెన్ని త్రోవలనైనన్. [6-159]

కోరుకున్నవాళ్లకు కైవల్యం (మోక్షం) చేరువలో ఉంటుంది. అయితే కోరనివారికి ఏ తోవలో పోయినా ఆ మోక్ష మార్గం ఎంతో దూరంగానే ఉంటుంది. ఈ పద్యంలో విష్ణువుని అన్నమాట – శ్రీవరుడు, లక్ష్మిని వరించినవాడు. ఈ దూరంగా పోవడాన్ని మరో విధంగా చెప్పాలంటే, మనం ఒక అడుగు ముందుకువేస్తే భగవంతుడు పది అడుగులు ముందుకి వస్తాడు. అయితే మనమో అడుగు వెనక్కి వేస్తే? ఆయన పది అడుగులు వెనక్కి వెళ్తాడు.

వ. అనినం బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె "మునీంద్రా! యాజ్ఞాభ్రష్టుం డై యమధర్మరాజు శ్రీవిష్ణు నిర్దేశకులచే విహతులైన భటులచేత వర్ణింపం బడిన నారాయణుని నామప్రభావం బాకర్ణించి, వారల కేమనియె? మఱియు, నెన్నఁడేని యమదండంబు విఫలం బై పోయిన తెఱంగు గలదేని వినవలయు; నీ సందేహంబుఁ బాప మహాత్మా! నీవు దక్కఁ దక్కిన వారలు సమర్థులు గారని తలంచుచున్నవాఁడ; చిత్తంబును బ్రసాదాయత్తంబుగా భవదీయ వచన సుధాధారలం బ్రసాదింపవలయు;" అనిన శుకుం డిట్లనియె. [6-160]

ఈ కథంతా విన్నాక పరీక్షిత్తు అడుగుతున్నాడు, "మరి ఆ విష్ణు దూతలు యమదూతలతో అజామీళుణ్ణి విడిపించి, మీకు ఈ ధర్మాధర్మ విషయంలో సందేహం ఉంటే, మీ రాజుని అడగండి పోయి అన్నారు కదా, వాళ్లతో యముడు ఏమన్నాడు? మరోసారి ఎప్పుడైనా యమదండం విఫలం అయిపోయిన సందర్భం ఉందా? ఈ సందేహం మీరు తప్ప మరొకరు తీర్చలేరు కనక అడుగుతున్నాను." ఈ ప్రశ్న అడగడం చూస్తే పరీక్షిత్తు మనలాంటి వాళ్లని ఉద్దేశించి, మన కోసమే అడిగాడనీ కథ యముడి సమాధానం తెలిసాక పూర్తవుతుందనీ, తెలుస్తుంది. శుక మహర్షి ఈ ప్రశ్నకి ఇచ్చిన సమాధానం తర్వాత వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS